క్లుప్తంగా

తిరుచ్చిపై సిరులతల్లి విహారం


తిరుచ్చిపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు (చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. సిరులతల్లిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం అలంకార మండపంలో తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి, నాలుగు మాడవీధులలో ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ విజయ భాస్కర్

చంద్రగిరి : ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎరువులు, పురుగుల మందు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో పేర్కొన్న మేరకు నిల్వ ఉన్న ఎరువులు, పురుగుల మందులను పరిశీలించారు. మూడు రోజుల పాటు తనిఖీలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తుంటే కఠినంగా వ్యవహరిస్తామని డీలర్లకు స్పష్టం చేశారు.

అక్రమ కట్టడాలపై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న పవన్‌కుమార్

తిరుపతి కల్చరల్ : శ్రీనివాసపురం పంచాయితీలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు సి.పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 20 అడుగుల రోడ్డు కలిగిన ప్రాంతంలో కనీసం మురుగునీటి కాలువకు కూడా స్థలం వదలకుండా బిల్డింగ్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. శంకర్‌రెడ్డి అనే వ్యక్తి స్థలంలో ప్రసాద్‌రెడ్డి అనే బిల్డర్ జీ ప్లస్ 3 భవనానికి పర్మిషన్ తీసుకుని ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారని వెల్లడించారు. దీనిపై ప్రశ్నిస్తే తాను న్యాయవాదినని, ఎదిరిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

గ్రామీణాభివృద్ధే లక్ష్యం


పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ

భాకరాపేట : గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డీఎల్‌పీఓ సురేష్‌కుమార్‌నాయుడు తెలిపారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని రంగన్నగారిగడ్డ, భాకరాపేట, చిట్టిచెర్ల, దేవ్‌ధార్లపల్లె పంచాయతీలను ఆయన సందర్శించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ సర్వే పర్యవేక్షణ నిమిత్తం విస్తృతంగా పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ సతీష్ పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు అండగా ఉంటాం


ధర్నాలో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు అండగా ఉంటామని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తెలిపారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేపట్టారు. చింతా మోహన్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలిపిరి నుంచి పేరూరు వరకు ఉన్న 400 ఎకరాల టీటీడీ భూముల్లో ఉద్యోగులకు 5 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపీ గౌడ్, రవి తేజోవతి, ముని శోభ, వెంకటేష్ గౌడ్, రావణ్, నరేంద్ర బాబు నాయుడు, చందనమూడి శివ పాల్గొన్నారు.

నీటి మూట.. దారి మాట!

వర్షాలకు కొట్టుకుపోయిన కేబీఆర్ నగర్ ప్రధాన మార్గంలోని రోడ్డు


వర్షం కురిస్తే అందరి మనసు పులకిస్తుంది. చినుకు కోసం ప్రతి హృదయం పరితపిస్తుంది. అయితే మంగళం పంచాయతీ కేబీఆర్‌నగర్ వాసులకు మాత్రం వణుకు పుడుతుంది. చిన్నపాటి వానకు సైతం కాలనీ ప్రధాన మార్గంలోని కాలువ ఉప్పొంగుతుంది. వరద నీరు నివాసాలను ముంచెత్తుతుంది. దీంతో వర్షం వెలిసినా నాలుగైదు రోజులపాటు జనజీవనం స్తంభిస్తుంది. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతుంది. ఈ క్రమంలోనే ఇటీవల కురిసిన వానకు కేబీఆర్ నగర్ రహదారి కొట్టుకుపోయింది. వెంటనే కల్వర్టు నిర్మించి రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని ఇచ్చిన హామీ గాలికి వెళ్లిపోయింది. ఈ మేరకు కాలనీవాసుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది.

- వర్షాలకు కొట్టుకుపోయిన కేబీఆర్ నగర్ రోడ్డు
- పదిరోజుల్లో కల్వర్ట్ నిర్మిస్తామని ఉత్తుత్తి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నాని
- రహదారి లేక అవస్థలు పడుతున్న కాలనీ వాసులు

తిరుపతి మంగళం : మంగళం పరిధిలోని కేబీఆర్‌నగర్ వాసులను రహదారి సమస్య వెంటాడుతోంది. వర్షం పడితే వారి అవస్థలు వర్ణనాతీతం. సమీపంలోని కాలువ పొంగి వరద నీరు కాలనీని చుట్టుముడుతుంది. దీంతో రాకపోకలు ఆగిపోతున్నాయి. ఎక్కడి వెళ్లాలన్నా తెగించి వరద నీటిని దాటిపోవాల్సిన దుస్థితి. గత రెండు నెలలుగా తరచూ కురుస్తున్న వర్షాలతో కేబీఆర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన మార్గంలోని పెద్ద కాలువపై ఉన్న రహదారి కొట్టుకుపోయింది. దీంతో కాలనీకి వరద నీటి ముంపు తగ్గింది కానీ, ప్రస్తుతం అక్కడకు వెళ్లేందుకు రోడ్డు లేకుండా పోయింది. ఈ క్రమంలో స్థానికులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

నెరవేరని ఎమ్మెల్యే హామీ!

''కేబీఆర్‌నగర్ వాసుల కష్టాలు తీరుస్తా.. చిన్నపాటి సమస్య వచ్చినా అండగా ఉంటా..వరద ముంపునకు అడ్డుగా నిలుస్తా.. మీ కాలనీని కాపాడుతా.. కొట్టుకుపోయిన రహదారిని పదిరోజుల్లోనే బాగు చేస్తా'' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హామీలు గుప్పించారు. రెండు నెలల క్రితం వర్షం వచ్చినప్పుడు కేబీఆర్‌నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే ఆ మేరకు స్థానికుల అవస్థలు చూసి మొసలికన్నీరు కార్చారు. కేవలం పది రోజుల్లోనే కేబీఆర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్ట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఊదరగొట్టి, ఇప్పుడు గాలికి వదిలేయడం గమనార్హం.

అవస్థలు పడుతున్నాం



రెండు నెలలుగా రాకపోకలకు దారి లేక అవస్థలు పడుతున్నాం. వర్షం పడిన ప్రతిసారీ ఎమ్మెల్యే నాని రావడం, అవి చేస్తా, ఇవి చేస్తానంటూ హామీలు ఇచ్చి వెళ్లిపోవడం తప్ప చేసిందేమీ లేదు. చిన్నపాటి సమస్య పరిష్కరించిన పాపానపోలేదు. మా ఓట్లు కావాలి కానీ, మా సమస్యలు పట్టడం లేదు. రాత్రి సమయంలో ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే రహదారి లేక రెండు కిలోమీటర్లు చుట్టుకుని ముళ్లపొదల్లో వెళ్లాల్సిన దుస్థితి. ఇప్పటికైనా మా సమస్యను పట్టించుకుని రహదారిపై కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలి.

– చిన్ని, కేబీఆర్‌నగర్ వాసి

కల్వర్ట్ నిర్మించాలి



కేబీఆర్‌నగర్ దారిలో కల్వర్ట్ నిర్మించాలి. కాలనీకి రహదారి సౌకర్యం కల్పించాలి. నాయకులు, అధికారులు నానుస్తున్నారే కానీ, పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాకపోకలకు మా కష్టాలు వారికేం తెలుసు. హామీలు ఇచ్చి వెళ్లిపోతారే తప్ప వాటిని పట్టించుకోవడం లేదు. చిన్న పిల్లలను పాఠశాలలకు పంపాలన్నా, మహిళలు బయటకు వెళ్లాలన్నా కాలనీ పక్కన ఉన్న స్మశానంలో నుంచి వెళ్లాల్సి వస్తోంది. వెంటనే కల్వర్ట్ నిర్మించి రహదారి ఏర్పాటు చేయాలి.

–పుండరీకాక్షయ్య, కేబీఆర్‌నగర్ వాసి




కాలువలో దిగి వెళుతున్న కేబీఆర్‌నగర్ వాసులు
కల్వర్టు నిర్మాణంపై స్థానికులకు హామీ ఇస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని (ఫైల్), పెద్ద కాలువ పొంగడంతో ధ్వంసమైన రహదారి

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : రాస్‌- ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 21 నుంచి 35 ఏళ్లలోపు స్థానికులైన వివాహిత మహిళలు అర్హులని పేర్కొన్నారు. నవాబ్‌పేట, ఎస్‌కేడీ నగర్, బండ్లవీధి, సాయినగర్, బీటీఆర్ కాలనీ-1, ప్రగతి నగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, నెహ్రూనగర్-1, ఎస్‌టీవీ నగర్-1, శివజ్యోతినగర్, ఎమ్మార్‌పల్లెలో అంగన్‌వాడీ సహాయకులు పోస్టులు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల వారు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తులను ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ ప్రధాన కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఒకప్పటి హెల్త్ ఆఫీసర్‌పై విచారణ

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 2020-21 మధ్య హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ సుధారాణిపై శుక్రవారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని టీబీ అధికారి వెంకట ప్రసాద్ విచారణ చేపట్టారు. ఆమె హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసే కాలంలో బ్లీచింగ్, మందుల కొనుగోలు, సర్టిఫికెట్ల మంజూరులో అక్రమాలకు పాల్పడ్డారని తిరుపతి చెందిన తుకారాం అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అలాగే వడ్డీ వ్యాపారం సైతం చేశారని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు లేఖ రాశారు. ఈ ఫిర్యాదులో విషయం లేకపోయినా అధికారులు విచారణకు ఆదేశించడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఫిర్యాదుదారుడు ఓ పత్రికలో పనిచేసినట్లు, అలానే తప్పుడు చిరునామా, ఫోన్ నంబర్లతో ఫిర్యాదు చేశాడని తెలిసినా విచారణకు ఆదేశించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విచారణకు ఫిర్యాదులో పేర్కొన్న ఒక్క బాధితుడు కూడా హాజరుకాకపోవడం గమనార్హం.

చెత్త కనిపిస్తే చర్యలు


మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో రోడ్ల పక్కన, వీధుల్లో ఎక్కడైనా చెత్త కుప్పలు కనిపిస్తే సంబంధిత సిబ్బంది,, చెత్త వేసిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య హెచ్చరించారు. పారిశుద్ధ్య పనులు, శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది విధులపై శుక్రవారం సాయంత్రం కచ్చపి ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు ఐదు వార్డులకు ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమిస్తున్నామని వెల్లడించారు. ఇంటింటి చెత్త సేకరణకు ప్రతి వాహనం నిర్దిష్ట సమయంలో వెళ్లేలా చూడాలని సూచించారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలో సీసీ కెమెరా లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

సస్యరక్షణతో నత్తల నివారణ


బంతి మొక్కపై నత్త

భాకరాపేట : సమగ్ర సస్యరక్షణతో నత్తలను నివారించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. శుక్రవారం భాకరాపేటలో ఆయన మాట్లాడుతూ కూరగాయలు, పూల తోటలలో నత్తల కారణంగా దిగుబడి తగ్గిపోతోందన్నారు. బొప్పాయి కాండం ముక్కలు, క్యాబేజీ ఆకులను ఎరగా వేసి నత్తలను అరికట్టవచ్చని వెల్లడించారు. తోట చుట్టూ రాళ్ల ఉప్పు, పొలంలో 15శాతం సాధారణ ఉప్పు ద్రావణంలో తడిపిన గోనె సంచులను అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే కేజీ తవుడు, 200 గ్రాముల బెల్లంలో 40శాతం మిథోల్‌మిల్ కలిపి విషపు ఎరులు వాడవచ్చని చెప్పారు. మెటాల్డిహైడ్ 2.5 శాతం డీపీ మందును ఎకరానికి 2 కిలోల చొప్పున వేసుకోవడం ద్వారా నత్తల నుంచి పంటలను కాపాడుకోవచ్చని వివరించారు.

కొనసాగుతున్న విచారణ

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో రెవెన్యూ అధికారిగా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబులపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ గురువారం కూడా విచారణ కొనసాగించారు. టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఆయా అంశాలను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు నివేదించేందుకు అధికారులు రికార్డులు సిద్ధం చేస్తున్నారు.

అంతర్ కళాశాలల క్రికెట్ విజేత 'సీకామ్'


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ కళాశాలల క్రికెట్ పురుషుల టోర్నమెంట్‌లో సీకామ్ కళాశాల విజేతగా నిలిచింది. కలికిరి సీకామ్ కళాశాలకు రన్నరప్ స్థానం దక్కింది. శుక్రవారం ఈ మేరకు వీసీ అప్పారావు చేతుల మీదగా విజేత జట్టుకు ట్రోఫీ అందించారు. రన్నరప్ జట్టుకు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ట్రోఫీ అందజేశారు. వీసీ మాట్లాడుతూ క్రీడారంగానికి పెద్ద పీట వేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సీకామ్ కళాశాల చైర్మన్ డాక్టర్ సురేంద్ర నాథ్‌రెడ్డి, డైరెక్టర్ ప్రణీత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ, స్వరాజ్యలక్ష్మి, రంజిత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి కల్చరల్ : టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యూనియన్ నేతలు కోరారు. శుక్రవారం ఈమేరకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శాప్ చైర్మన్ ఎ.రవినాయుడుకి వినతి పత్రం సమర్పించారు. అలాగే యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌కు సైతం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వై.హేమప్రకాష్, ప్రధాన కార్యదర్శి కె.దేవానంద, కోశాధికారి గాలి నారాయణ నాయుడు, ఉపాధ్యక్షుడు ఉదయ భాస్కర్, హేమకుమార్, జగదీశ్వరరావు, జీఎం.రవికృష్ణ, ఎం.మాధవి, రెడ్డయ్య, మోహన్ ,గోపీకృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే, ఎన్సీబీసీ చైర్మన్ హన్స్‌రాజ్ అహిర్, ఎంపీ శ్రీకాంత్ షిండే, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మహారాష్ట్ర మంత్రులు సంబాజీ పాటిల్, సుధార్, ఉదయ్ సమంత్ తదితరులు శుక్రవారం దర్శించుకున్నారు.

మహిళల హక్కులపై అవగాహన


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : మహిళలకు హక్కులపై అవగాహన అవసరమని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మహిళల హక్కులు, ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. గైనకాలజిస్ట్ పద్మజ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు 14–45 ఏళ్ల మహిళలందరికీ హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధారాణి, జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ లక్ష్మి, డాక్టర్ బి.మంజుల, డాక్టర్ అలేఖ్య, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ పాల్గొన్నారు.

బ్రాహ్మణుల వన మహోత్సవం రేపు

తిరుపతి కల్చరల్ : స్థానిక త్యాగరాజ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కార్తీక వన మహోత్సవం నిర్వహించనున్నట్లు తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ప్రకారం తులసి దామోదర పూజ, శివ కేశవుల పూజ, అభిషేకం, కార్తీక పురాణ ప్రవచనం ఉంటుందని వెల్లడించారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

క్యాంపస్‌లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి సిటీ : ఎస్వీయూ క్యాంపస్‌లో అధికారులు శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ×మందుబాబులకు అడ్డాగా ఎస్వీయూ॥ శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి వర్సిటీ అధికారులు స్పందించారు. ఈ మేరకు పోలీసులు సైతం వర్సిటీలో పెట్రోలింగ్ చేపట్టారు. దీనిపై విద్యార్థులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న ఫార్మసీ విద్యార్థులు

రామచంద్రాపురం: ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని టీటీడీ ఫార్మాసిస్ట్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబుతో కలిసి సొరకాయలపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రసన్న రాజు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్లు సతీష్‌కుమార్, శివగామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ మరుగుదొడ్డి


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్తులు

తిరుపతి రూరల్ : ఇంటింటికీ మరుగుదొడ్డి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవాన్ని పురస్కరించుకొని దుర్గసముద్రం పంచాయతీలో ×మన మరుగుదొడ్డి-మన గౌరవం॥ పేరుతో స్థానికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డీ కన్సల్టెంట్ రాజా, ఎంసీఏ శరత్‌బాబు, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి నిరసన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : మామండూరులో ఈతకు వెళ్లి మృతి చెందిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ విద్యార్థి హేమాద్రికి విద్యార్థి సంఘాల నేతలు నివాళులర్పించారు. శుక్రవారం కళాశాల ఎదుట హేమాద్రి చిత్రపటం ఏర్పాటు చేశారు. హాస్టల్ అధికారుల నిర్లక్ష్యంపై నిరసన తెలిపారు. పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యార్థి మరణించినట్లు ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు మన్నం ప్రేమ్ కుమార్, సుధాకర్ మాదిగ, కొండ యుగంధర్, సుధాకర్ మాదిగ, ముని, సుకుమార్, హరినాథ్, బలరాం ,విక్రమ్ యాదవ్, ప్రభు, వెంకటరమణ, సాయి, సంపత్, దినేష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సురేష్‌బాబు

తిరుపతి కల్చరల్ : దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని శ్రీకనకదుర్గ దివ్యాంగ సొసైటీ అధ్యక్షుడు జి.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అర్హులైన దివ్యాంగులు ఇప్పటికీ వివిధ కారణాలతో పెన్షన్లు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. సొంత ఇంటి స్థలం లేక అవస్థలు పడుతున్నారని వాపోయారు. అలాగే దివ్యాంగులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. సమావేశంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి కె.కోదండ, రెడ్డి విశ్వనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఆదుకోవాలని వినతి


మాట్లాడుతున్న ఆనంద్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : జార్జియాలో చిక్కుకుపోయిన ఎంబీబీఎస్ తెలుగు విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నేత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జార్జియాలోని ఇలియా యూనివర్సిటీలో సుమారు 60 మంది ఎంబీబీఎస్ చదువుతున్నారన్నారు. వీరు హ్యాపీ లివింగ్ ప్రైవేట్ హాస్టల్ యాజమాన్యానికి ఎనిమిది నెలల ఫీజు కింద రూ.1.20లక్షల చొప్పున ముందుగా చెల్లించారని, అయితే రెండు నెలల తర్వాత హాస్టల్ యజమాని కమాన్ మోసం చేసి వెళ్లిపోయాడని చెప్పారు. దీంతో పిల్లలు రోడ్డున పడ్డారని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నేడు అవగాహన ర్యాలీ


మాట్లాడుతున్న రంగనాయకులు

తిరుపతి కల్చరల్ : జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటలకు అవగాహన ర్యాలీ చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.రంగనాయకులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బాలాజీ కాలనీలోని ఎస్వీ హైస్కూల్ మైదానం నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, తీర్థకట్ట వీధి, భవానీనగర్ మీదుగా ఎస్వీ పాలిటెక్నిక్ వరకు ర్యాలీ సాగుతుందని వెల్లడించారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డాక్టర్ రమేష్‌రెడ్డి , డాక్టర్ సాయికోటేశ్వర శర్మ, బాలాజీ, దుర్గాప్రసాద్, డాక్టర్ శ్రీనివాస చరణ్, ప్రకాష్ పాల్గొన్నారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీస్ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలపై ముమ్మర దాడులు కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ సీఐ నరసానాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రేణిగుంట మండలం గణేష్‌నగర్‌కు చెందిన గ్లాడ్విన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం తెచ్చి, అధిక ధరలకు గ్లాడ్విన్ అమ్ముతున్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ కవీశ్వరనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.